

హాసనాంబ దేవి మూలవిరాట్టు

నగరంలో సగం



● గ్రేటర్ ఎన్నికల్లో 50శాతం టికెట్లు మహిళలకు ● కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత స్థానం: నగరాభివృద్ధి శాఖ మంత్రి డీకే

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) ఎన్నికల్లో 50శాతం టికెట్లు మహిళా అభ్యర్థులకు ఇవ్వనున్నట్లు డీసీఎం, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార, బెంగళూరు రాజకీయ క్రియా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు అభివృద్ధి, పరివర్తన గురించి బుధవారం చర్చాగోష్ఠి జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నగర సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించే లక్ష్యంగా పాలన, సేవలు అందించేందుకు జీబీఏ అస్తిత్వంలోకి వచ్చిందన్నారు. జీబీఏ పరిధిలోని ఐదు పాలికెల ఎన్నికల్లో 50శాతం టికెట్‌లు మహిళలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బెంగళూరు పాలికెల్లో సగంమంది మహిళా కార్పొరేటర్లు ఉంటారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా బెంగళూరు నగరంలో అనేక సవాళ్లు ఉన్నాయి. జీబీఏను పరిచయం చేయడానికి ఇదే తగిన సమయమన్నారు. మనమంతా బెంగళూరు ప్రజలమేనన్నారు. నగరీకరణ అనేది ఏ దేశం లేదా నగరానికి పెద్దసవాల్ అన్నారు. ప్రజలు విద్య, ఉద్యోగం, ఉత్తమ జీవనం ఇతరత్రా కారణాలతో బెంగళూరుకు వలస రావడం పెరిగిందన్నారు. విద్య విషయంలో బెంగళూరు నగరం దేశంలోని ఇతర నగరాలకంటే ఉత్తమమన్నారు. బెంగళూరులో 25 లక్షలమంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని, 2 లక్షలమంది విదేశీపాస్‌పోర్ట్ కల్గినవారు బెంగళూరులో పనిచేస్తున్నారన్నారు. ఎస్ఎం కృష్ణ సీఎంగా ఉన్న అవధిలో తాను నగరాభివృద్ధి మంత్రిగా వ్యవహరించానని, అప్పట్లో బెంగళూరులో 70లక్షలమంది జనాభా ఉండేవారని ప్రస్తుతం 1.40 కోట్లకు పెరిగారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి

బెంగళూరు నగర నిర్మాత కెంపేగౌడ శతాబ్దాల క్రితమే అన్ని వర్గాల సముదాయాల వారికి వ్యాపారానికి అవకాశం కల్పించేలా బెంగళూరును రూపొందించారన్నారు. అనేక అంశాలలో అంతర్జాతీయస్థాయిలో బెంగళూరుకు గుర్తింపు ఉందన్నారు. బెంగళూరులో అత్యుత్తమ మానవవనరులు ఉన్నాయని ఈ కారణంగా ఇక్కడ హెచ్ఏఎల్, ఐటీఐ, బెమెల్ సహా ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 270కుపైగా ఇంజనీరింగ్, 70 మెడికల్ కళాశాలలు, 1400 నర్సింగ్ కళాశాలలు ఉన్నాయన్నారు. అయితే ట్రాఫిక్, చెత్త సంస్కరణ, తాగునీరు ప్రధాన సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. వీటిని సమర్థవంతంగా నిభాయించడం, సమన్వయం సాధించేందు ఉద్దేశ్యంతో జీబీఏ అస్తిత్వంలోకి తెచ్చామన్నారు. ప్రజలు, అధికారులు పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే బెంగళూరు ప్రగతి సాధ్యమన్నారు.

బెంగళూరులో 198 వార్డులు భారీ ప్రమాణంలో ఉన్నాయి. అన్ని వార్డుల నిర్వహణకు కేవలం ఒక్కరే కమిషనర్ ఉన్నారని, దీనివల్ల నిర్వహణ కష్టంగా ఉందన్నారు. రానున్న 10-15 సంవత్సరాల్లో బెంగళూరు జనాభా 2 కోట్లకు చేరనుందని, ట్రాఫిక్‌తోపాటు ఇతర సమస్యలను నిభాయించడానికి తాను బెంగళూరును పాలికెలుగా విభజించామన్నారు. ఉత్తమ పాలనకోసం ఐదు పాలికెలను 368 వార్డులుగా విభజించినట్లు తెలిపారు. స్వచ్ఛత, సంచార సంస్కరణకు అనేక చర్యలు తీసుకున్నామన్నారు.

చెత్త నిర్వహణలో ప్రజలు సహకరించాలి



బెంగళూరు నగరంలో వివిధశాఖల మధ్య సమన్వయం లేదని, జీబీఏ వల్ల సమన్వయం సాధించదలిచినట్లు డీసీఎం తెలిపారు. పచ్చదనంతో పాటు స్వచ్ఛత కూడా కీలకమన్నారు. ప్రతి ఇంటికి 2-3 వాహనాలు ఉన్నాయని, ఇంటి ముందు స్థలం లేకపోవడంతో రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారన్నారు. కాగా కొన్నిచోట్ల రోడ్లపై ఇష్టం వచ్చినట్లు చెత్త పడేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త నిర్వహణలో ప్రజల సహకారం తప్పనిసరి అన్నారు. అదే రీతిన సాధ్యమైన మేరకు తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వడం ద్వారా సంస్కరించడం సులభతరం కాగలదన్నారు. కాగా ప్రస్తుతానికి 368 వార్డులకు సంబంధించి ప్రతి వార్డుల్లోనూ వార్డు సమితి ఏర్పాటు చేశామని, ఇందులో అన్నివర్గాల ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చునన్నారు.

సొరంగ మార్గానికి ప్రత్యామ్నాయం ఏదీ..?

సాధారణ రోడ్లపై ట్రాఫిక్ పెరగడంతో సొరంగ మార్గం అంశాన్ని ప్రతిపాదించగా పలు అభ్యంతరాలు వచ్చాయని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. ఇది కాకుండా ప్రత్యామ్నాయం ఏముందని ప్రశ్నించారు. ప్రజారవాణా మెరుగు చేయడానికి చేసే ప్రయత్నాలపై విమర్శలు వస్తున్నాయన్నారు. సొరంగ మార్గంతోపాటు 44 కిమీ డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్, 120 కిమీ మేర ఫ్లై ఓవర్‌కు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. రాజకాలువ చుట్టుపక్కల 50 అడుగల బఫర్‌జోన్‌లో రోడ్డు నిర్మించడానికి తీర్మానించామన్నారు. తద్వారా 300 కిమీ అధికంగా రోడ్డు సాధ్యమవుతుందన్నారు. ఇది చిన్న విషయం కాదని, ఆర్థిక సహకారం అవసరమన్నారు. మన విద్యార్థుల విలువైన సమయాన్ని ట్రాఫిక్‌లో వృథా చేయడం అంగీకరించమన్నారు. సాధ్యమైనంత త్వరగా నూతన పథకాలు అమలు చేస్తామన్నారు.

అదిగదిగో హాసనాంబ

● ఏడాది తర్వాత తెరుచుకున్న హాసనాంబ ఆలయం
● నాటి నుంచి వెలుగుతున్న అఖండజ్యోతి
● నేటి నుంచి భక్తులకు అమ్మ దర్శనం
● జాతరకు శ్రీకారంతో తరలివచ్చిన భక్తజనం

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏడాదికోసారి మాత్రమే తెరుచుకునే హాసనాంబ దేవి ఆలయం అంగరంగవైభవంగా భక్తజనం నినాదాల మధ్యన గురువారం తెరిచారు. హాసన్ జిల్లా ప్రజలు ఆదిదేవతగా కొలిచే హాసనాంబ ఆలయం మధ్యాహ్నం 12.19గంటలకు శాస్త్రోక్తంగా గర్భగుడి తలుపులు తెరిచారు. తళవారం వంశస్తులకు చెందిన నరసింహరాజు ఆలయ ప్రాంగణంలో అరటి చెట్లును కత్తిరించడం ద్వారా సంప్రదాయాలకు శ్రీకారం చుట్టారు. గర్భగుడిలో ఏడాది కిందట వెలిగించిన దీపం యథావిధిగా వెలుగుతూ ఉన్నట్లు అర్చకులు ప్రకటించారు. గర్భగుడిలోకి ప్రవేశించాక ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అంతకు ముందు ప్రధాన అర్చకుడు నాగరాజు నేతృత్వంలో మంగళవాయిద్యాల మధ్యన పూజా సామాగ్రిని తీసుకువచ్చారు. గర్భగుడికి తలుపులకు పూజలు జరిపారు.

పూజలు నిర్వహించిన పీఠాధిపతులు

ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ, శంభునాథ స్వామీజీ, పుష్పగిరి మఠం సోమశేఖర శివాచార్య స్వామీజీ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కృష్ణభైరేగౌడ, ఎంపీ శ్రేయస్ పటేల్, ఎమ్మెల్యేలు హెచ్‌పి స్వరూప్ ప్రకాష్, కెఎం శివలింగేగౌడ, సిమెంట్ మంజు, జిల్లాధికారి లతాకుమారితో పాటు జిల్లాధికారులు పాల్గొన్నారు. గురువారం శాస్త్రోక్తంగా గుడి తలుపులు తెరిచారు. కానీ ఆలయ సంప్రదాయక పూజలు కొనసాగుతాయి. దీంతో భక్తులకు దర్శన అవకాశం ఉండదు. రాత్రిదాకా ప్రత్యేక విధానాలు, పూజలతో పాటు ఆలయ గర్భగుడిలో మరమ్మత్తుల వంటి తాత్కాలిక పనులు పూర్తి చేస్తారు. శుక్రవారం నుంచి ఈనెల 23వ తేదీ వరకూ పూజలు కొనసాగుతాయి. హాసనాంబ జాతర కూడా ప్రారంభమైంది. నగర వ్యాప్తంగా ఎక్కడ చూసినా జనసందడి కనిపించింది. జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా భారీకేడ్‌లు అమర్చారు. దర్శనాలకు వచ్చే భక్తులకు అనువుగా పలు సౌలభ్యాలు ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో భారీ స్క్రీనింగ్‌లు ఏర్పాటు చేశారు. భక్తుల దర్శనాల కోసం ప్రత్యేక టికెట్‌లను కొనుగోలు చేసే పద్ధతి తీసుకువచ్చారు. పాలకమండలి వాట్సాప్ చాట్ ద్వారా ఆన్‌లైన్ సేవలు పొందవచ్చును. టికెట్ బుకింగ్‌తో పాటు దర్శన సమయాన్ని ముందుగా నిర్ధారించుకునేందుకు వీలుంటుంది. 63661 05589 నంబరు ద్వారా ఆన్‌లైన్ సేవలు వివరాలు తెలుసుకునేందుకు వీలు కల్పించారు.



గర్భగుడిలో పూజలు చేస్తున్న పండితులు



ఆకాశ్ కంబార, సాక్షి కంబార (ఫైల్)

భార్యను చంపి రెండురాత్రులు మృతదేహంతోనే

● తరలించే ప్రయత్నాలు విఫలం
● దుర్వాసన రావడంతో నిందితుడి పరారీ
● బెళగావి జిల్లాలో ఘటన

7



శరణగౌడ (ఫైల్)

ప్రతిపక్షనేత అశోక్ వాహన డ్రైవర్ ఆత్మహత్య

ఆగిపోనున్న ఆకాశయానం

● కలబురగి - బెంగళూరు మధ్య 15నుంచి విమాన సర్వీసులు బంద్
● బుకింగ్ ఆపేసిన ఎయిర్‌పోర్ట్ అధికారులు ● ప్రయాణికుల సంఖ్య తగ్గడమే కారణం

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక (హైదరాబాద్ కర్ణాటక) లోని కలబురగి జిల్లా కేంద్రం నుంచి బెంగళూరుకు సుమారు 620 కిలోమీటర్ల దూరం ఉంది. హైదరాబాద్‌కు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుల్బర్గా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. వెనుకబడిన కల్యాణ కర్ణాటక జిల్లాలకోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా కలబురగిలో విమానాశ్రయాన్ని నిర్మించారు. 2019 నవంబరు 22న అప్పటి ముఖ్యమంత్రి యడియూరప్ప లాంఛనంగా ప్రారంభించారు. క్రమేపీ ప్రయాణికుల డిమాండ్ మేరకు సర్వీసులు పెంచారు. ఇందులో భాగంగా స్టార్ ఎయిర్ సంస్థ బెంగళూరు నుంచి కలబురగికి వారానికి మూడు సర్వీసులు నడిపేవారు. 2025 ఏప్రిల్ 16న డైయిలీ సర్వీసులను ప్రారంభించింది. అయితే తాజాగా ఈనెల 15నుంచి కలబురగి - బెంగళూరు మధ్య డెయిలీ సర్వీసులను నిలిపివేయనుంది.

కల్యాణ కర్ణాటకలో తొలి పౌరవిమాన సేవలు అందించే విమానాశ్రయంగా కలబురగికి గుర్తింపు ఉంది. బెంగళూరు, తిరుపతి, ముంబై, హైదరాబాద్‌లకు విమానసేవలు ఉండేవి. అయితే కాలక్రమంలో బెంగళూరు మినహా ఇతర ప్రాంతాలకు విమాన సేవలు నిలిపివేశారు. తాజాగా వారానికి మూడుసార్లు మాత్రమే సర్వీసులు నడుపుతున్న స్టార్ ఎయిర్ సంస్థ ఈనెల 15నుంచి సంపూర్ణంగా సేవలు నిలిపివేయనున్నట్లు సమాచారం.

బీదర్, శివమొగ్గ న్యూ ఎయిర్‌పోర్ట్, మహారాష్ట్రలోని సోలాపుర్‌లనుంచి విమాన సర్వీసులకు స్టార్ ఎయిర్ సంస్థ అనుమతి పొందింది. అందుకే కలబురగి విమానాశ్రయం నుంచి సేవలు నిలిపివేయనున్నట్లు తెలుస్తోంది. కలబురగిలో ప్రయాణికుల సంఖ్య తగ్గడమే ప్రధాన కారణమనేది సమాచారం. కాగా రాజకీయ కారణాలు కూడా ఉండవచ్చునని కథనాలు వినిపిస్తున్నాయి.

అడ్వాన్స్ బుకింగ్‌లు నిలిపివేత



కలబురగి విమానాశ్రయం

ప్రస్తుతం స్టార్ ఎయిర్ విమానసంస్థ కలబురగి నుంచి బెంగళూరుకు ఎలాంటి అడ్వాన్స్ బుకింగ్‌లు చేసుకోవడం లేదు. అయితే బీదర్ నుంచి వారంలో అన్నిరోజులు విమాన సర్వీసులు ఉన్నాయి. అక్కడనుంచి బుక్ చేసుకోవాలంటూ కస్టమర్ కేర్ సిబ్బంది సూచిస్తున్నారు. కలబురగి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ జ్ఞానేశ్వర్‌రావ్ మాట్లాడుతూ ఈనెల 15 తర్వాత బుకింగ్ నిలిపివేయబడిందన్నారు. అయితే విమానసంచారం నిలిపివేస్తున్నారనే సమాచారం సంస్థ నుంచి అధికారికంగా రాలేదన్నారు. బుకింగ్‌లు నిలిపివేయడంతో విమాన సర్వీసులు ఉండవనే ఊహాగానాలకు ఊతమిస్తోంది. కలబురగి నుంచి అడ్వాన్స్ బుకింగ్‌లు నిలిపివేయడంతో సర్వీసులు ఉండవనేది దాదాపు ఖరారైనట్లేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ కుమారుడికి

కీలక బాధ్యతలు

● కేరళ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వార్ రూం చైర్మన్‌గా నియమిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు



హర్ష

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : శాసనసభ మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ కుమారుడు హర్ష కనడంకు ఏఐసీసీ కీలక బాధ్యతలు అప్పగించింది. కేరళ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వార్ రూం చైర్మన్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న శాసనసభ ఎన్నికల కోసం పార్టీ బలోపేతంతో పాటు ఎన్నికల వేళ క్రియాశీలకంగా వ్యవహరించే బాధ్యతలను ఆయనకు అప్పగించింది. పార్టీ యువనాయకుడు హర్ష సంఘటనలతో పాటు ఎన్నికల ప్రక్రియలలో కీలక భూమిక పోషిస్తున్న మేరకు అవకాశం కల్పించారు. తద్వారా రమేష్‌కుమార్ వారసుడిగా హర్ష క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చినట్లు అయ్యింది. ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వార్ రూం ద్వారా ఎన్నికల ప్రక్రియలతో క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు ప్రచారాలు, సోషల్ మీడియాతో పాటు ప్రాంతాల వారీగా ప్రధాననేతల ప్రసంగాలకు సంబంధించి సమగ్ర సమాచారం ఇవ్వడం వంటి కీలక పనులు చేపట్టాల్సి ఉంటుంది. అగ్రనేతలతో పాటు రాష్ట్రానికి సంబంధించి ప్రచార సభలు ఇతరత్రా పార్టీ వ్యవహారాలను వార్ రూం నుంచే పర్యవేక్షిస్తుంటారు. కోలార్ జిల్లా శ్రీనివాసపురం నుంచి సుదీర్ఘకాలం రాజకీయాలు కొనసాగించిన రమేష్‌కుమార్ 2023 ఎన్నికలలో ఓటమి తర్వాత కేవలం నియోజకవర్గానికే పరిమితంగా ఉన్నారు. అయితే పార్టీ అధిష్టానం కుమారుడు హర్షకు కీలక బాధ్యతలు అప్పగించడంతో రమేష్‌కుమార్ అనుచరులు, శ్రేయోభిలాషులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా

● ప్రదర్శనను ప్రారంభించనున్న నటి సమంత



బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనలకు పేరొందిన జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలు గురువారం నుంచి లాంఛనంగా ప్రారంభం కానున్నాయి. ప్రదర్శనలకు సంబంధించి జ్యూవెల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ విక్రం మెహ్తా గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. మూడు రోజుల పాటు ప్రదర్శనలు త్రిపురవాసిని ప్యాలెస్‌లో జరుగుతాయన్నారు 27వ విడత ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపేందుకు గర్వంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పేరిందిన 100మంది బంగారు, వజ్రాల వ్యాపార సంస్థలు ప్రదర్శనలలో పాల్గొంటున్నారన్నారు. త్వరలో వస్తున్న దీపావళి పండుగ ప్రతి ఇంటా కొత్తకాంతులతో పాటు కోరుకున్న బంగారం, వజ్రాభరణాలు సొంతం చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. ప్రాచీన, ఆధునిక డిజైన్‌లతో పాటు ప్రాంతాలు, రాష్ట్రాల వారిగా పేరొందిన మోడల్స్ ప్రదర్శనలలో ఉంటాయన్నారు ఇదే సందర్భంగా సరికొత్త స్కీంను శ్రీకారం చుట్టామని ప్రతి రోజు 100లు పొదుపు చేయడం ద్వారా రానున్న ప్రదర్శనల వేళ కోరుకున్న బంగారు ఆభరణాలను పొందవచ్చునని అందుకు 15శాతం బంగారం పొందే వెసలుబాటు కల్పించామన్నారు. జ్యూవెల్స్ ఇండియా ప్రదర్శనలను ప్రముఖ దక్షిణాది నటి సమంతా లాంఛనంగా ప్రారంభిస్తారన్నారు.



తడిసిన మొక్కజొన్నను ఆరబోస్తున్న రైతులు



వరి పొలాల్లోకి చేరిన నీరు

మొక్కజొన్నను ముంచిన వాన

కంప్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : తాలుకాలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి రైతులు కలాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న పంట పూర్తిగా తడిసిపోయింది. ఎన్నో కష్టాలను ఎదుర్కొని సాగు చేసిన పంట చేతికందిందని, అమ్ముకుందామనుకుంటే నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దేవసముద్రం క్రాస్ వద్ద ఆరబోసుకున్న మొక్కజొన్న పూర్తిగా తడిచిపోయింది. మార్కెట్లో ధరలు లేకపోవడంతో ఇప్పటికే నష్టపోతున్నామని, ఇక తడిసిన ధాన్యాన్ని ఎవరు కొంటారని రైతులు నాగరాజు పక్కీరప్ప, జడప్ప ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వర్షం రాక వల్ల వరి పొలాల్లో కూడా ఎక్కడ చూసినా నీరు నిలిచిపోయాయి. కోతకొచ్చిన వేళ వర్షాలు కురవడంతో వరి నీటిపాలైందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విత్తుతోచని రైతు..!

ముందస్తు వర్షాలతో పప్పుశనగ సాగుకు సమాయత్తం.. బెళుగుప్ప మండలంలో ఊపందుకున్న విత్తు


- నేటికీ అందని సబ్సిడీ విత్తనం
- రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలవని దుస్థితి
- బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొంటున్న కొందరు అన్నదాతలు
- ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలో మరికొందరు
- విత్తన సరఫరాకు బకాయిల సమస్య


బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తుతున్న రైతులు

ముందస్తు వర్షాలతో పదునైంది. ఆరిపోతోంది కూడా. పప్పుశనగ విత్తుకు సరైన అదును కూడా. అన్నదాతలు ఆశల సాగుకు సమాయత్తమవుతున్నారు. బెళుగుప్ప మండలంలో ఇప్పటికే విత్తు జోరందుకుంది. పక్షం రోజుల్లో పూర్తవనుంది కూడా. మిగతా ప్రాంతాల్లో త్వరలోనే విత్తనం వేయనున్నారు. నేటికీ సబ్సిడీ విత్తనం అందలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలవలేదు. ఎప్పుడు ఇస్తారో తెలీదు. చెప్పేవారు కూడా లేరు. దీంతో అన్నదాతలు ఆశలు వదులుకుంటున్నారు. కొందరు బయట మార్కెట్‌లో అధిక ధరలకు విత్తనాలు కొని, పంట వేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో మరికొందరు రైతులు నిరీక్షిస్తున్నారు. బయట కొనేందుకు డబ్బుల్లేక, సబ్సిడీ విత్తనం ఇవ్వక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విత్తన సరఫరాకు బకాయిలు సమస్యగా మారాయి. వాటిని చెల్లిస్తేనే సరఫరా చేస్తామంటూ ఆయా సంస్థలు మొండికేస్తున్నాయి.

అనంతపురం అర్బన్/బెళుగుప్ప/యాడికి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పప్పుశనగ విత్తు జోరుగా సాగుతోంది. ఈసారి సీజన్‌కు ముందుగానే పదును వర్షాలు పడటంతో నల్లరేగడి భూముల్లో సేద్యం పనులు పూర్తి చేసుకున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఎక్కువగా పదునైంది. బెళుగుప్ప మండలంలో పదును ఆరటంతో ముందస్తుగానే పప్పుశనగ విత్తనం మొదలు పెట్టారు. ఐదు రోజులుగా విత్తనం వేస్తున్నారు. మండలంలో ఏటా 15వేల ఎకరాలకుపైగా పప్పుశనగ సాగు చేస్తున్నారు. వారం రోజుల్లోనే 2వేల ఎకరాలకు పైగా పప్పుశనగ విత్తనం వేశారు. పక్షం రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనం వేసే అవకాశం ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

బెళుగుప్ప మండలంలో పదును ఆరడంతో పప్పుశనగ విత్తనం జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో చిన్న, సన్నకారు రైతులకు చుక్కెదురైంది. సబ్సిడీ విత్తనం ఇస్తారని వారంతా ఆశతో ఎదురుచూశారు. ఇతర రైతులు విత్తనం వేస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6,200కి కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు సబ్సిడీ విత్తనాల కోసం నిరీక్షిస్తున్నారు. మండలంలో పప్పుశనగ విత్తనం పూర్తిగా వేసిన తర్వాత సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తారా..? అంటూ రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సబ్సిడీ విత్తనం దళారులపాలవ్వడం ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు మండలాల్లో సబ్సిడీ విత్తనం రాగానే తాము కోరిన మేర విత్తనాలు ఇవ్వాలంటూ కొందరు నాయకులు.. అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఉరవకొండ నియోజకవర్గంలోని మిగతా మండలాల్లో ఇంకా పదును ఆరలేదు. పదును ఆరగానే పప్పుశనగ విత్తనం వేసేందుకు ఆయా ప్రాంతాల రైతులు సిద్ధంగా ఉన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని మండలాల్లో మరోసారి వర్షం పడితే విత్తనం వేసేందుకు సమాయత్తమవుతున్నారు.


బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తన శుద్ధి చేస్తున్న రైతు

విత్తన పంపిణీపై నిర్లక్ష్యం

ఎన్నడూ లేనివిధంగా ఈసారి సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ నెలారంభం నుంచి రబీ సీజన్ ఆరంభమైంది. ఏటా రబీ సీజన్‌లో 55వేల హెక్టార్లకుపైగానే పప్పుశనగ పంట సాగవుతోంది. సెప్టెంబరు 29వతేదీన ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ-11 రకం క్వింటా పూర్తి ధర రూ.7800గా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటా ధర రూ.5,850 చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు గరిష్ఠంగా ఐదెకరాలకు 10 బస్తాల (బస్తా 20 కేజీలు) పప్పుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. గతేడాది జిల్లాకు 27వేల క్వింటాళ్ల పప్పుశనగను కేటాయించారు. ఈసారి 14వేల క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. జిల్లాలో ఎక్కువ శాతం మంది సబ్సిడీ విత్తనాలపైనే ఆధారపడి పంటను సాగు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ఈసారి పప్పుశనగ కేటాయింపులు పెంచాలని రైతులు, రైతుసంఘాల నాయకులు కోరుతున్నారు. గతేడాది అక్టోబరు 1వతేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. గతంలో అక్టోబరు రెండోవారం నుంచి విత్తన పంపిణీని ప్రారంభించేవారు. ఈసారి నేటికీ పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించపోవడం విమర్శలకు తావిస్తోంది.

బకాయిలే సమస్య..

గతేడాది రబీ సీజన్‌లో పప్పుశనగ సరఫరాకు సంబంధించిన రూ.40కోట్ల బకాయిలు ఉన్నాయి. దీంతో ఈసారి సరఫరా మొదలు పెట్టలేదు. బకాయిలు చెల్లిస్తేనే.. సరఫరా మొదలు పెడతామని సంబంధికులు మొండికేశారు. విత్తన సరఫరాకు టెండర్లు నిర్వహించనప్పటి నుంచి ఈ వివాదం కొనసాగుతున్నా.. ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆఖరుకు సబ్సిడీ ధరలు ఖరారు చేసినా.. క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలకు పప్పుశనగ విత్తనాలు సరఫరా చేయలేని పరిస్థితి. ఇంత జరుగుతున్నా పాలకులు పట్టనట్లు వ్యవహరిస్తుండటం ఏమిటో అర్థంకావడంలేదని రైతులు వాపోతున్నారు.

బెళుగుప్ప మండలంలో ఇప్పటికే పప్పుశనగ విత్తనం వేయడం మొదలైంది. ఐదెకరాలకుపైగా పొలం ఉన్న రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. చిన్న,సన్నకారు రైతులు సబ్సిడీ విత్తనాల కోసం నిరీక్షిస్తున్నారు. పదును ఆరిపోతుందనే భయంతో మరికొందరు రైతులు అప్పులు చేసి, బహిరంగ మార్కెట్‌లోనే విత్తనాలు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పప్పుశనగ సరఫరాపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేదంటే జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులపై అదనంగా ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. మరి ఏ మేరకు ప్రభుత్వ పెద్దలు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

అదును దాటిపోయాక పంపిణీ చేసి.. ఏం లాభం?



పప్పుశనగ విత్తుకు ఇది సరైన సమయం. ఇంతవరకు సబ్సిడీ విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియే మొదలుపెట్టలేదు. ఇక విత్తనం ఎప్పుడు పంపిణీ చేస్తారు? అదును దాటిపోయాక పంపిణీ చేసి, ఏం లాభం? అదునులోనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు అవసరమైన మేర ఇవ్వాలి.

-నాగేంద్రరెడ్డి, రైతు, భోగాలకట్ట, యాడికి మండలం

విత్తనమే రాలేదంటున్నారు..



సబ్సిడీ విత్తన పప్పుశనగ కోసం అధికారులను అడిగితే ఇంకా స్టాక్ రాలేదని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా మొదలు పెట్టలేదు. పప్పుశనగ విత్తనం ఇంకెప్పుడు పంపిణీ చేస్తారు? సకాలంలో రైతులకు విత్తన పప్పుశనగ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి.

-జగదీష్, రైతు, ఎన్. కొత్తపల్లి, యాడికి మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బెళుగుప్ప మండలంలో పప్పుశనగ విత్తన పంపిణీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మండలానికి 3,500 క్వింటాళ్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. బహిరంగ మార్కెట్‌లో రైతులు కొనుగోలు చేసి, విత్తనం వేస్తున్నారని, తక్షణమే పంపిణీ మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరాం. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -పృథ్వీసాగర్, వ్యవసాయ అధికారి, బెళుగుప్ప మండలం

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- సూపరింటెండెంట్ అమర్‌నాథ్
- ఘనంగా ప్రపంచ తపాలా దినోత్సవం


ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ అమర్‌నాథ్, తపాలాశాఖ ఉద్యోగులు, సిబ్బంది

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): తపాలశాఖ అందించే సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ అమర్‌నాథ్ కోరారు. ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సూపరింటెండెంట్ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... తపాలా సేవలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14వతేదీ వరకూ విద్యార్థులకు పలు పాఠశాలల్లో ఉచిత ఆధార్ సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం నగరంలోని విశ్వభారతి పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- దెబ్బతిన్న అరటి తోటలు
- వంగపేరులో ట్రాక్టర్ బోల్తా


వసంతపురంలో నేలకొరిగిన అరటిచెట్లను చూపుతున్న రైతు కమతం చిన్నకాటమయ్య

ధర్మవరం రూరల్, కొత్తచెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం గాలివానలు తోట పంటలను దెబ్బతీసింది. ధర్మవరం మండలంలో అరటి తోటలు నేలకొరిగాయి. చిగిచెర్లలో రైతు తాడిమర్రి చెన్నారెడ్డి, వసంతపురంలో రైతు కమతం చిన్నకాటమయ్యకు చెందిన అరటి చెట్లు నేలకొరిగాయి. దిగుబడి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులకు తీవ్రంగా నష్టపోయారు. భారీ వర్షానికి కుంటలు నిండి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కొత్తచెరువు మండలం వంగంపల్లి సమీపంలో వంగపేరు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో రైతు ధర్మపురి వెంకటేశ్ ఆరబోసిన మొక్కజొన్న ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా నీటి ఉధృతికి బోల్తా పడింది. దీంతో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. రూ.40 వేలు నష్టపోయానని బాధిత రైతు తెలిపారు. ట్రాక్టర్‌ను ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు.


ఇరగంపల్లి సమీపాన వంగపేరులో బోల్తాపడిన ట్రాక్టర్

గురువుల ఉద్యమబాట

- డిమాండ్ల సాధనకు నేటి నుంచి నిరసనలు
- ఫ్యాప్టో పిలుపుతో బోధనేతర పనుల బాయ్‌కాట్

అనంతపురం విద్య, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఉపాధ్యాయులు ఉద్యమబాట పడుతున్నారు. డీఏ, పీఆర్సీ తదితర బకాయిల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళనకు సిద్ధమవుతున్నారు. బోధనేతర పనుల నుంచి తమను తప్పించాలని కోరుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించలేదని, పీఆర్సీని నియమించి మధ్యంతర భృతి ప్రకటించలేదని, పెండింగ్ డీఏలు చెల్లించలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యారంగంలో సంస్కరణల పేరుతో తెస్తున్న మార్పులను పలువురు ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 7న విజయవాడలో పోరుబాట నిర్వహించారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేదాకా అన్ని జిల్లాల్లో ఉద్యమం కొనసాగించాలని ఫ్యాప్టో నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో నిరసన విషయమై కలెక్టర్ ఆనంద్‌ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు.


కలెక్టరు ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

నేటి నుంచే..

రాష్ట్ర విద్యాశాఖ అమలు చేస్తున్న వివిధ రకాల బోధనేతర (ఆన్‌లైన్) కార్యక్రమాలను చేయకూడదని ఫ్యాప్టో నిర్ణయం తీసుకుంది. ఈ నిరసనకు శుక్రవారం నుంచే టీచర్లు శ్రీకారం చుడుతున్నారు. ఉపాధాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనాల వివరాలు మాత్ర మే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 13 నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహించినా, మూల్యాంకనం చేసి మార్కులు రికార్డుల్లో మాత్రమే నమోదు చేసి, ఆన్‌లైన్‌లో చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు. నిరసనలో భాగంగా కలెక్టరు, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేయనున్నారు.

ఏడాదిన్నర దాటినా..



ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నాం. ఏడాదిన్నర దాటినా పరిష్కరించడం లేదు. సంస్కరణల పేరుతో వివిధ బోధనేతర పనులు అప్పగించి టీచర్లను ఇబ్బంది పెడుతున్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నాం. జిల్లాలో కూడా నిరసనలు తెలియజేస్తాం.

- శ్రీనివాసనాయక్, ఫ్యాప్టో జిల్లా చైర్మన్

వ్యతిరేకత లేకుండా చూసుకోవాలి..



ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఇప్పటివరకు ఉపాధ్యాయవర్గాల్లో ప్రభుత్వంపై అసంతృప్తి మాత్రమే ఉంది. ఇది వ్యతిరేకతగా మారకుండా ప్రభుత్వం చూసుకోవాలి. నిర్లక్ష్యం చేయకుండా ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పెద్దలు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. డిమాండ్లు తీరేంత వరకు బోధనేతర పనులను బాయ్‌కాట్ చేస్తాం.

-వెంకటరత్నం, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ

హామీలు అమలు చేయాలి..



వైసీపీ ప్రభుత్వం రివర్స్ పీఆర్సీ ఇచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీరని అన్యాయం చేసింది. దాన్ని ప్రశ్నించకుండా భయపెట్టింది. ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు జరిగిన అన్యాయాలను తెలుపుతూ, తాము అధికారంలోకి రాగానే అన్ని సమస్యలు తీరుస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చింది. ఆ హామీలను త్వరగా నెరవేర్చాలి. అప్పటివరకు ఇలాగే ఉద్యమాలు కొనసాగిస్తాం.

-రమణారెడ్డి, ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ

ఇళ్ల మధ్యలో దీపావళి బాంబులు

- పొంచి ఉన్న బాణసంచా ప్రమాదం
- అనధికారిక నిల్వలపై చర్యలు పట్టవా..?

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దీపావళి దగ్గరపడింది. బాణసంచా విక్రయాలకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. భారీగా నిల్వలను తెప్పించి.. జనావాసాల నడుమ, అనధికారిక గోడౌన్లలో నిల్వ చేస్తున్నారు. నిబంధనలు పాటించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. హిందూపురంలో బాణసంచా వ్యాపారం చేసే ఇద్దరికి మాత్రమే గోదాములకు అనుమతి ఉంది. ఒకరికి పెనుకొండ నియోజకవర్గ పరిధిలో, మరొకరికి హిందూపురంలో గోడౌన్‌లు ఉన్నాయి. ఈ రెండూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అధికారులే అంటున్నారు. కానీ చర్యలు తీసుకోవడం లేదు. హిందూపురం ప్రాంతంలో నిబంధనలకు అనుగుణంగా ఒక్క గోడౌన్ కూడా లేదు. మడకశిర, పెనుకొండ, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి సహా అన్ని మండల కేంద్రాల్లో ఒకరిద్దరికి మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతులు ఉంటాయి. కానీ ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 30మంది ఏడాది పొడవునా బాణసంచా విక్రయిస్తున్నారు. రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది.


గతేడాది పరిగిలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన టపాసులను సీజ్ చేసిన పోలీసులు

ప్రమాదాలు జరిగితే..?

దీపావళి సమయంలో ప్రమాదాలు పరిపాటిగా మారాయి. అధికారులు పాఠాలను నేర్వడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచాను నిల్వ ఉంచిన గోదాముల వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతోంది. ఇలాంటి సంఘటన జరిగితే తప్ప అధికారుల్లో చలనం కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో చాలా మంది వ్యాపారులు ఇళ్ల మధ్యలోనే బాణసంచా నిల్వ చేశారని సమాచారం. రాజకీయ పార్టీల ర్యాలీలు, విజయోత్సవాలు, పెళ్లిళ్ల సమయంలో లక్షలాది రూపాయల బాణసంచా పేలుస్తున్నారు. ఇదంతా అనధికారిక గోడౌన్‌ల నుంచే వస్తోందని అధికారులకు తెలుసు. అయినా అప్రమత్తం కావడం లేదు. దీపావళికి ఏటా హిందూపురంలోనే 20మందికి పైగా తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేస్తున్నారు. సరుకు 60 శాతమే అమ్ముడుపోతోంది. మిగిలిన 40 శాతం ఇళ్ల మధ్యలో నిల్వ ఉంటోంది. దీని గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ మిగిలిన సరుకును ఏడాది పొడవునా విక్రయిస్తుంటారు.

ఇళ్ల మధ్యలోనే నిల్వ

హిందూపురంలోని మోతుకపల్లికి వెళ్లే దారిలో ఓ వ్యాపారికి చెందిన బాణసంచా గోదాము ఉంది. దానికి 20 ఏళ్ల కిందట లైసెన్స్ మంజూరు చేశారు. అప్పట్లో ఆ గోడౌన్ సమీపంలో జనావాసాలు లేవు. ప్రస్తుతం దాని చుట్టూ ఇళ్లను నిర్మించుకున్నారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత..? ఐదేళ్ల కిందట హిందూపురం తహసీల్దారు ఆ వ్యాపారిని పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఊరి బయట ఎక్కడైనా నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. కానీ ఇప్పటికీ మార్పు జరగలేదు. పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని ఇంట్లో బాణసంచా నిల్వ ఉంచుకుని అమ్ముతున్నారు. మరో వ్యక్తి పట్టణంలోనిప్రధాన సర్కిల్‌లో, ఇళ్ల మధ్య చిన్న గోడౌన్ ఏర్పాటు చేసుకుని బాణ సంచా నిల్వ ఉంచారు. ఓ కళాశాలలో పనిచేసే ఉద్యోగి రైల్వే గేటుకింద అనధికారికంగా నిల్వ ఉంచారు. ముక్కడిపేట, హస్నాబాద్, పారిశ్రామికవాడలోని ఓ ప్రాంతంలో టపాసులు పెద్దఎత్తున నిల్వ ఉంచినట్లు సమాచారం. పండుగ దగ్గరపడేకొద్ది ధరలు పెరుగుతాయి. దీనివల్ల వ్యాపారులు దీపావళికి రెండు నెలలు ముందుగానే స్టాక్ తీసుకొచ్చి నిల్వ ఉంచుకుంటున్నట్లు సమాచారం.

చవితికి రూ.కోటి వ్యాపారం

వినాయక చవితి విగ్రహం ఏర్పాటు నుంచి నిమజ్జనం ముగిసేవరకు పురంలో రూ.లక్షలు విలువ చేసే టపాసులు పేల్చారు. ఇదంతా ఇక్కడే కొన్నదే. టపాసుల విక్రేతలే విగ్రహాల వద్దకు వెళ్లి మాట్లాడుకున్నారు. డిస్కౌంట్ ఇచ్చి మరీ అమ్మారు. ఈ ఏడాది నిమజ్జనం రోజే హిందూపురంలో రూ.కోటికి పైగా టపాసులు పేల్చారంటే అనధికారికంగా విక్రయాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఊహించవచ్చు.

కఠిన చర్యలు తీసుకుంటాం..




వ్యాపారులు ఊరి బయట గోదాముల్లోనే టపాసులు నిల్వ ఉంచాలి. అక్కడ నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్యలో నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. లైసెన్స్ ఉన్నవారు పండుగకు మాత్రమే బాణసంచా విక్రయించుకోవాలి. ఏడాదిపాటు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తామంటే కుదరదు. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించాలి.

-ప్రభాకర్, అగ్నిమాపకశాఖ అధికారి

మెరుగైన సేవలే లక్ష్యం

- దిశ సమావేశంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- నిర్లక్ష్యపు సమాధానం చెబితే చర్యలు తప్పవ్: కలెక్టర్
- శిశువు మృతికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: జడ్పీ చైర్‌పర్సన్


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలోని సమావేశ భవనంలో గురువారం జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) నిర్వహించారు. ఎంపీతోపాటు కలెక్టర్ ఆనంద్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, దిశ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కొనకొండ్ల ఎంసీహెచ్‌లో పరిస్థితి దారుణంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందనీ, సమస్య ఎక్కడుందని డీఎంహెచ్ఓ ఈబీ దేవిని ప్రశ్నించారు. సిబ్బంది కొరత ఉందనీ, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామనీ, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు బీమా అందించినట్లు తెలిపారు. సబ్సిడీ పప్పుశనగ పంపిణీకి చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. జేడీ మాట్లాడుతూ.. 25 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించడానికి అంచనాలు తయారు చేసి, పంపామన్నారు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పుకొచ్చారు. అదును దాటిపోతోందనీ, వెంటనే పంపిణీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లాలో మొక్కజొన్న విస్తారంగా సాగు చేశారనీ, ప్రస్తుతం కోత దశలో ఉందనీ, ఇప్పుడు ధరలు తగ్గిపోతున్నాయనీ, ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి, రైతును ఆదుకోవాలని సభ దృష్టికి తెచ్చారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని ఎంపీ ఆదేశించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల ప్రతిపాదనలు ఏమయ్యాయని ఎంపీ ప్రశ్నించారు. అన్నీ ఆమోద దశలో ఉన్నాయనీ, పరిశీలన కూడా పూర్తయిందని రైల్వే ఇంజనీర్ చెప్పారు. రహదారుల్లో, జిల్లా కేంద్రంలోని సర్వీస్ రోడ్లలో సైతం జాతీయ రహదారుల అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఎంపీ.. సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి అంచనాలు తయారు చేసి, సమస్య తలెత్తకుండా చూస్తామని సంబంధిత అధికారులు సమాధానమిచ్చారు.

నిర్లక్ష్యపు సమాధానం ఇస్తే చర్యలు

సమావేశంలో నిర్లక్ష్యపు సమాధానం ఇస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆనంద్.. విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల నిర్మాణ సమయంలో ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కంబదూరు జడ్పీటీసీ సభ దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ ఎస్ఈ.. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభంలోనే హద్దులు ఏర్పాటు చేస్తే అందుకు అనుగుణంగా స్తంభాలు ఏర్పాటు చేయడానికి తమకు ఇబ్బంది లేదన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు పూర్తి దశలో ఉన్నపుడు ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి హద్దులు ఇస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆనంద్.. ఎస్ఈపై సీరియస్ అయ్యారు. 'ఆర్అండ్‌బీ ఎస్ఈ ఇక్కడే ఉంటారు కదా.. చర్చించుకుని, సమస్యను పరిష్కరించకుంటే ఎలా? మరొకరిపై నెపం వేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవ'ని హెచ్చరించారు.

శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

శిశుగృహంలో శిశువు మృతి బాధాకరమని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సమావేశంలో ప్రస్తావించారు. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్.. విచారణలో బాధ్యులను తేల్చి, విధుల నుంచి తొలగిస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీపీఓ నాగరాజనాయుడు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

డాక్టర్ శివరామ కారంత్ (జయంతి)



కన్నడ నాట 'నడెదాడువ విశ్వకోశ'గా పేరొందిన కవి, సాహితీవేత్త డాక్టర్ శివరామకారంత్ 1902 అక్టోబరు 10న ఉడుపి జిల్లా కోట గ్రామంలో జన్మించారు. జ్ఞానపీఠ, పద్మభూషణ్ పురస్కారం సహా పలు గౌరవాలు అందుకున్నారు. నవలలు, నాటికలు, చిన్నకథలు రాశారు. యక్షగానపై రెండు పుస్తకాలు రచించారు. ఖాదీ, స్వదేశీ ఉద్యమాల్లో కర్ణాటకలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. 1997 డిసెంబరు 9న కన్నుమూశారు.

ఆర్‌కే నారాయణ్ (జయంతి)




జాతీయస్థాయిలో పేరొందిన మాల్గుడి కథలు రచించిన 'పద్మవిభూషణ్' గ్రహీత రాశిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి (ఆర్‌కే నారాయణ్) 1906 అక్టోబరు 10న చెన్నైలో జన్మించారు. ఆంగ్లసాహిత్యంలో పట్టు కలిగి ఉత్తమ నవలా రచయితల్లో ఒకరిగా నిలిచారు. 'ది గైడ్' నవల హిందీలో సినిమాగా రూపుదిద్దుకుంది. ఆరు దశాబ్దాలలో పద్మభూషణ్, సాహిత్య అకాడమీ ఫెలోషిప్ తదితర పురస్కారాలు అందుకున్నారు. రాజ్యసభకు ఎంపికయ్యారు. 2001 మే 13న కన్నుమూశారు.

నేదునూరి కృష్ణమూర్తి (జయంతి)



కర్ణాటక సంగీతంలో సంగీత కళానిధిగా పేరొందిన వయోలిన్ వాదకులు నేదునూరి కృష్ణమూర్తి 1927 అక్టోబరు 10న గోదావరి జిల్లా పిఠాపురం తాలూకా కొత్తపల్లిలో జన్మించారు. తల్లి ప్రభావంతో సంగీతంపై ఆసక్తి పెంచుకుని అష్టపదులు, తరంగాలు, రామాయణ కృతులు పాడారు. ఆలిండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా పేరొందారు. టీటీడీ, కంచికామకోటి పీఠంచే ఆస్థాన విద్వాన్‌గా గుర్తింపు పొందారు. సంగీత చూడామణి, తెలుగుతల్లి అవార్డు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2014 డిసెంబరు 8న కన్నుమూశారు.

గురుదత్ (వర్ధంతి)



బాలీవుడ్ అలనాటి ప్రముఖ హిందీ దర్శకులలో ఒకరైన గురుదత్ 1925 జూలై 9న ఉడుపి జిల్లా బైందూరు తాలూకా పడుకొనె గ్రామంలో జన్మించారు. దర్శకుడిగానే కాక నటుడు, నిర్మాత, రచయితగా రాణించారు. బాలీవుడ్‌లో 1960, 70 దశకంలో తనదైన గుర్తింపు పొందారు. ప్యాసా, కాగజ్ కే ఫూల్ సినిమాలు పేరొందాయి. 1964 అక్టోబరు 10న కన్నుమూశారు. 2004లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

రేఖ (పుట్టినరోజు)



పద్మశ్రీ గ్రహీత ప్రముఖ నటి రేఖ 1954 అక్టోబరు 10న చెన్నైలో జన్మించారు. అసలు పేరు భానురేఖా గణేశన్. బాలనటిగా, నటిగా సినీరంగంలో తనదైను గుర్తింపు పొందారు. 180కుపైగా హిందీ సినిమాలలో నటించారు. 1981లో విడులైన 'ఉమ్రావ్ జాన్'సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. ఐఫా జీవితసాఫల్య పురస్కారం, నేషనల్, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పొందారు. 2012లో రాజ్యసభ సభ్యురాలిగా ఎంపికయ్యారు. నేటికీ తనదైన చరిష్మా కలిగి ఉన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి (పుట్టినరోజు)



టాలీవుడ్‌ను జాతీయస్థాయికి తీసుకెళ్లిన అగ్ర దర్శకులలో ఒకరైన ఎస్ఎస్ రాజమౌళి 1973 అక్టోబరు 10న కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా అమరేశ్వర క్యాంప్‌లో జన్మించారు. పూర్తి పేరు కోడూరి శ్రీశైల శ్రీ రాజమౌళి. ఇప్పటి వరకు ఒక పరాజయం కూడా చవిచూడకపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన దర్శకత్వం వహించిన 'బాహుబలి' సినిమా అంతర్జాతీయ ఖ్యాతి గడించి రూ.1800 కోట్లను వసూలు చేసింది. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు నాటు' పాట ఒరిజినల్ సాంగ్‌గా ఆస్కార్ అవార్డు గెలుచుకుంది. 3 జాతీయ, నాలుగు దక్షిణ ఫిల్మ్‌ఫేర్, రెండు సైమా అవార్డులు, 'పద్మశ్రీ', 'నంది' తదితర అవార్డులు అందుకున్నారు.

ప్రయోగాలతోనే ఆత్మనిర్భర్ భారత్ సాధ్యం : గవర్నర్

బెంగళూరు/దొడ్డబళ్లాపుర, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో శాస్త్రీయత వైపు అవగాహన, ప్రయోగాలు చేయించడం ద్వారా ఆత్మనిర్భర్ భారత్‌కు బలం చేకూర్చినట్టు అవుతుందని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రశంసించారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, కర్ణాటక స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ సంయుక్తంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో తొలి టెలిస్కోప్ తర్ఫీదు శిబిరంలో విద్యార్థులు వరల్డ్ రికార్డు సాధించడంపై అభినందించారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో ఆసక్తి, సృజనశీలత పెరుగుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన ఆత్మనిర్భర్ భారత్‌కు ఇది ప్రతిబింబిస్తోందన్నారు. రీసెర్చ్ కౌన్సిల్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ హలికల్ నటరాజ్, అతడి బృందం ప్రయత్నాలను కొనియాడారు. పాఠాలలోని జ్ఞానాన్ని అనుభవపూర్వకంగా పరిశోధనలకు ప్రేరేపించడం అభినందనీయమన్నారు. యువశాస్త్రవేత్తలకు ప్రమాణపత్రం, పతకం అందచేశారు. కొత్తదనం కోసం ప్రోత్సహించే ప్రయత్నాన్ని అభినందించారు. ఆర్యభట్ట నుంచి చంద్రయాన్-3 వరకు సాధనలను స్మరించారు. నేను శాస్త్రవేత్తను 2025లో భాగంగా తొలి టెలిస్కోప్ శిబిరం 2025 దొడ్డబళ్లాపుర బెసంట్‌పార్క్‌లో విజయవంతంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా 160కుపైగా విద్యార్థులు పాల్గొని తమదైన రీతిలో టెలిస్కోప్ విన్యాసాలు రూపొందించడం ద్వారా ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లలో నమోదైంది. రాష్ట్ర సైన్స్ పరిషత్ అధ్యక్షుడు హలికల్ నటరాజ్ గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. హైకోర్టు రిటైర్డు జస్టిస్ నాగమోహన్‌సదాస్, ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఏఎస్ కిరణ్‌కుమార్, దొడ్డబళ్లాపుర ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్, పరిషత్ గౌరవ సలహాదారుడు డాక్టర్ కేఎస్ విజయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్

విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి

● జపానందస్వామీజీ పిలుపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జపానంద స్వామీజీ

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్ భారత మాణిక్యాలని మీ వృత్తితోపాటు సమాజంకోసం మీవంతు సేవ అందించాలని పావగడ రామకృష్ణ సేవా ఆశ్రమ జపానందస్వామిజీ అభిప్రాయపడ్డారు. నగరంలోని బీఎన్ఎంఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. దేశంలో నిరక్షరాస్యులు అధికమని ఇలాంటి తరుణంలో అన్నిసౌకర్యాలు కల్గిన కళాశాలలో చదువుకోవడం మీ అదృష్టమన్నారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా తాను వచ్చిన దారి మరువరాదన్నారు. అదేరీతిన మీరు ఏ హోదాకు చేరుకున్నా సమాజానికి మీ వంతు సేవ అందించడం విస్మరించరాదని విద్యార్థులకు హితవు పలికారు. విద్యార్థులు జీవితంలో మానవతా విలువలను పెంచుకోవాలన్నారు. అబ్దుల్‌కలాం పైలట్ అయ్యేందుకు కలలు కన్నారని అందుకు ఎన్నో ప్రయత్నాలు, కృషి చేశారన్నారన్నారు. అలాగే రాష్ట్రపతిగా సేవలందించారన్నారు. బీఎన్ఎంఐటీ డీన్ ప్రొఫెసర్ ఈశ్వర్ ఎన్ మానె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో గెలుపోటములు ఉంటాయని, వాటిని అర్థం చేసుకుని ముందుకు సాగడం నేర్చుకోవాలన్నారు. మీ ప్రతిభకు తాము వేదిక కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ టీజే రామమూర్తి, కళాశాల అదనపు డైరెక్టర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వై కులకర్ణి, డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

యువశక్తిని ప్రోత్సహించాలి: కమిషనర్

రాయచూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పట్ల యువతను ఆకర్షించడం, వారిలోని సృజనాత్మక శక్తిని ప్రోత్సహించి అభివృద్ధివైపు నడిపించడమే మారథాన్ ప్రధాన లక్ష్యమని రాయచూరు మహానగర పాలిక కమిషనర్ జుబీన్ మొహపాత్ర అన్నారు. రాయచూరు మహానగర పాలిక వివిధ విభాగాల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మహాత్మగాంధి క్రీడామైదానంలో 5కి.మీ మారథాన్ రన్ నిర్వహించారు. డీహెచ్ఓ డాక్టర్ సురేంద్ర బాబు పచ్చజెండా ఊపి మారథాన్ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జుబీన్ మొహపాత్ర, నగర స్వచ్ఛత రోడ్ల అభివృద్ధి కనీస సౌకర్యాల మెరుగు తదితర ప్రధాన అంశాలే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకుల్లోని నకరాత్మక శక్తిని పోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.



మారథాన్‌కు పచ్చజెండా ఊపుతున్న అధికారులు



బంకులోకి దూసుకెళ్ళిన ట్రక్కు

బెంగళూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చామరాజనగర్ టీఆర్ మిల్ సమీపంలోని నయారా పెట్రోలు బంకులోకి ఒక్కసారిగా అదుపుతప్పిన భారీ ట్రక్కు దూసుకుపోయింది. బుధవారం జరిగిన ప్రమాదంతో స్థానికులు బెంబేలెత్తి పరుగులు తీశారు. మండ్య జిల్లా శ్రీరంగపట్టణం నుంచి కేఆర్ మార్కెట్‌కు వంటనూనెను తీసుకువచ్చిన ట్యాంకర్ డీజిల్‌ను భర్తీ చేసుకునేందుకు వచ్చింది. అంతలోనే ఒక్కసారిగా బ్రేక్ ఫెయిల్ కావడంతో బంకుకు అనుబంధంగా ఉండే దుకాణం ధ్వంసమైంది. ఇదే సమయంలోనే పెట్రోలు వేయించుకునేందుకు వచ్చిన ద్విచక్రవాహన దారులు బంకు సిబ్బంది భయపడి పరుగులు తీశారు. అయితే ప్రమాదంలో ఎవరికీ ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బంకు చుట్టూ నివాసాలు, దుకాణాలు ఉండటంతో భయం కలిగించింది.

దూసుకుపోయిన ట్రక్కును పరిశీలిస్తున్న స్థానికులు

భార్యను చంపి
రెండు రాత్రులు మృతదేహంతోనే

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భార్యను చంపిన భర్త రెండు రోజులు మృతదేహాన్ని దగ్గరే ఉంచుకున్నారు. తరలించే ప్రయత్నం ఫలించక పరారీ అయ్యారు. బెళగావి జిల్లా మూడలగి తాలూకా కమలదిన్ని గ్రామంలో ఘటన గురువారం వెలుగు చూసింది. సాక్షి కంబారను మే 24న ఆకాశ్ కంబార పెళ్లి చేసుకున్నాడు. హుబ్బళ్ళిలోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఆకాశ్ తనకు లక్ష రూపాయలు జీతం అని అబద్ధం చెప్పి పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. 50 గ్రాముల బంగారం, రూ.5లక్షల నగదు కోసం వేధించేవాడని ఈ కారణంగానే భార్యను చంపేశాడంటూ సాక్షి కుటుంబీకులు మూడలగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రస్తుతానికి ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న ఆకాశ్‌కోసం గాలింపు చేపట్టారు. సాక్షి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

జిల్లా ఎస్పీ భీమాశంకర్ గుళేద్ మీడియాతో మాట్లాడుతూ సోమవారం మధ్యాహ్నం భార్యను గొంతు నులిమి ఆకాశ్ చంపాడన్నారు. అనంతరం మృతదేహాన్ని బెడ్‌రూంలోని మంచం బాక్స్‌లో వేసి, తన తల్లికి ఫోన్ చేసి తామిద్దరం గోకాక్ వెళ్లి వస్తామని చెప్పాడన్నారు. ఆకాశ్ తల్లి యల్లమ్మదేవి సేవ చేస్తుండడంతో ఆమె ఆలయంలోనే బస చేసేది. మంగళవారం ఆకాశ్ తల్లి ఇంట్లో ఏదో వాసన వస్తోందని చెప్పగా ఆమెకు అబద్ధం చెప్పి ఏమార్చాడు. ఇలా రెండు రోజులు భార్య మృతదేహం తోనే ఆకాశ్ నిద్రించాడు. అయితే ఆమె మృతదేహం తరలించడం సాధ్యం కాదని గుర్తించి పరారయ్యాడు. చివరకు బెడ్‌రూం నుంచి దుర్వాసన అధికంగా వస్తుండడంతో ఆకాశ్ తల్లి పరిశీలించగా మంచం కింద మృతదేహం ఉన్నట్టు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతిపక్ష నేత ఎస్కార్ట్ వాహన డ్రైవర్ ఆత్మహత్య

బెంగళూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక శాసనసభ ప్రతిపక్ష నేత ఆర్ అశోక్ ఎస్కార్ట్ వాహనం డ్రైవర్ శరణగౌడ రామగోళ్(33). ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం బాపూజీనగర్‌లోని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శరణగౌడకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శరణగౌడ భార్య శైలశ్రీ కూడా పోలీసు కానిస్టేబుల్ కాగా మాగడి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శరణగౌడ పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తూనే కొంతకాలంగా ప్రతిపక్షనేత అశోక్ ఎస్కార్ట్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శరణగౌడ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే ప్రతిపక్షనేత అశోక్ నేరుగా విక్టోరియా ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అశోక్ మీడియాతో మాట్లాడుతూ రెండురోజులుగా స్థానికంగా లేనని బెంగళూరుకు వచ్చిన వెంటనే విషయం తెలియగా బాధకలిగిందన్నారు. శరణగౌడ ఎవరితోను వివాదాలు లేనివారన్నారు. విధి నిర్వహణ మినహా మరో ఆలోచన ఉండేది కాదన్నారు. మంత్రాలయంకు వెళుతున్నట్లు చెప్పారని తోటి ఉద్యోగులకు తెలిపారన్నారు. శరణగౌడకు కుటుంబ సమస్యలు ఏవీ లేవన్నారు. దసరా పండుగరోజున స్వీట్స్‌తో పాటు దుస్తులు ఇచ్చానన్నారు. అకస్మాత్తుగా తన కాళ్ళకు దండం పెట్టారన్నారు. సాధారణంగా పోలీసులు ఎవరూ ఇటువంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. అయితే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారనేది తెలియాల్సి ఉందన్నారు. మంచివ్యక్తి దూరమయ్యారని విచారం వ్యక్తం చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న : మంత్రి

పెనుకొండ టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తొలితరం స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న అని మంత్రి సవిత కొనియాడారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గోరంట్లలో ఈనెల 26న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి రావాలని ఆ సంఘం నాయకులు మంత్రి సవితను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వడ్డెర్లకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోరంట్ల మండల వడ్డెర్ల సంఘం నాయకులు రామాంజినేయులు, వడ్డెర సాధికార సమితి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ పల్లపు మహేంద్ర, గోరంట్ల మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ వడ్డె అమర్నాథ్, నిడిమామిడప్ప, బాలకృష్ణ, వడ్డె రమణ, శ్రీనివాసులు, హనుమన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణకు మంత్రిని ఆహ్వానిస్తున్న వడ్డెర్లు

సుప్రీంలో ఘటనపై నిరసన

రాయచూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడికి ప్రయత్నించిన న్యాయవాది పై తక్షణ చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు తాహెర్ హుసేన్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ గురువారం జిల్లాలో మాన్వి తాలూకాలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద వివిధ ప్రజాసంఘాలు, న్యాయవాదులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తాహెర్ హుసేన్ సీజేఐ పై దాడియత్నాన్ని న్యాయవ్యవస్థపై రాజ్యాంగం పై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. ఈ సందర్భంగా దళిత నేత రవీంద్ర జానేకల్, జనశక్తి సంఘం జిల్లాధ్యక్షుడు మారెప్ప హరవి, ఎద్దేళు కర్ణాటక జిల్లాధ్యక్షుడు శరణు, సర్వధర్మ సేవా వెల్ఫేర్ ట్రస్ట్, కోట అధ్యక్షుడు హనుమంతు, పోట్నాళ్ సీటు అధ్యక్షుడు శర్ఫుదీన్ తదితరులు పాల్గొన్నారు.

'బాలికల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

హిందూపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. గురువారం హిందూపురంలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రహమత్‌పురం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ బేటీబచావ్, బేటీ పడావ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బాలికలు, యువతులను రక్షించడం, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, టూటౌన్ సీఐ కరీం, సీడీపీఓ వరలక్ష్మీ పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు జరిగాయి. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు జరిగాయి. పలు ప్రాంతాల్లో మానవహారంగా ఏర్పడి బాలికల దినోత్సవంపై అవగాహన కల్పించారు.

ప్రతిపాదనల్లోనే పర్యాటకాభివృద్ధి..!

● నివేదికలు సిద్ధం
● ఏడాదిన్నరగా ముందుకు కదలని వైనం

జిల్లాలో ఎన్నెన్నో అనుకూలతలు



బుక్కపట్నం చెరువు

శిల్పకళల కాణాచి లేపాక్షి.. రాయల రెండో రాజధాని పెనుకొండ, తిమ్మమ్మ మర్రిమాను, ఖాద్రీశుడి ఆలయం, ధర్మవరం పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ పక్షుల విడిది కేంద్రం వీరాపురం ఇలా.. ఎన్నెన్నో చారిత్రక ప్రత్యేకతలు. హంద్రీనీవా నీటితో రిజర్వాయర్లు, పెద్ద చెరువులు కళకళలాడుతున్నాయి. పర్యాటకాభివృద్ధికి లెక్కకు మిక్కిలి అనుకూలతలు ఉన్నాయి. ఆదాయ వనరులను సమకూర్చుకునే స్థాయికి జిల్లాలో పర్యాటకాభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు కూడా వెళ్లాయి. ఇక, అక్కడితో ఆగిపోయింది. అడుగు కూడా ముందుకు పడట్లేదు. ఎందుకో, ఏమో..?

▼ గొల్లపల్లి రిజర్వాయర్ ▼



పుట్టపర్తి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యాటక ప్రాంతాలకు పెట్టింది పేరు. గత వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక రంగాన్ని పూర్తిగా విస్మరించారు. గతేడాది అధికారం చేపట్టిన కూటమి.. పర్యాటక రంగానికి వన్నె తెచ్చేలా జిల్లాను పర్యాటక ఆదాయ వనరుగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యాటక శాఖ సమీక్షలో జిల్లా పర్యాటక అభివృద్ధికి కార్యాచరణ ప్రారంభించారు. కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతి నివేదికలో పర్యాటకంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలనీ, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష చేశారు. నవంబరులో సత్యసాయి శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు పుట్టపర్తిలో అభివృద్ధి పనులు మొదలు పెట్టారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో లేపాక్షి ఉత్సవాలను ఘనంగా చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. లేపాక్షి, పెనుకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, విదేశీ అతిథులు విడిదిచేసే వీరాపురం, ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరం చేనేత పట్టుచీరలు, నిమ్మలకుంట తోలుబొమ్మలు, తిమ్మమ్మ మర్రిమాను ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా అంతటా పర్యాటక, చారిత్రాక సంపద, కళాకృతులే కనిపిస్తాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. జిల్లాకు పర్యాటకంగా ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించే దిశగా చేస్తున్న ప్రయత్నాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పర్యాటక అభివృద్ధికి అన్ని అనుకూలతలు ఉన్నా.. జిల్లాలో నిధులు విడుదల చేసి పనులు వేగం పెంచితేనే ఆ ఫలితాలు అందుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బోటింగ్‌కు అనుకూలతలు ఉన్నా..

హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులకు జలకళ వచ్చింది. బుక్కపట్నం, ధర్మవరం చెరువులతోపాటు గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజయర్వాయర్లు నీటితో తొణికిసలాడుతున్నాయి. వాటిలో బోటింగ్ అనుకూలతలపై పర్యాటక శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. బుక్కపట్నం చెరువులో మాత్రమే ప్రైవేటు బోటింగ్ ఏర్పాటు చేశారు. సెలవులు, పండుగ రోజుల్లో పర్యాటకుల తాకిడి ఉంటోంది. బోటింగ్ మాత్రమే ఉండడం, ఇతర ప్రత్యేకతలు లేకపోవడంతో పర్యాటకులు కొంత అసంతృప్తితో వెళ్తున్నట్లు తెలుస్తోంది. గొల్లపల్లి రిజర్వాయర్‌కు నిత్యం పర్యాటకులు వస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పెనుకొండ, గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద పర్యాటక అభివృద్ధి పనులు చేపడతామనీ, బోటింగ్ ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా బోటింగ్ కూడా ఏర్పాటు చేయించలేకపోయారని పర్యాటకులు ఆవేదన చెందుతున్నారు. ధర్మవరం చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పిస్తే పర్యాటకులకు ఆహ్లాదం పంచే అవకాశాలున్నాయి. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అన్ని అవకాశాలు ఉన్నా.. ప్రతిపాదనలతో సరి పెట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



చిత్రావతిలో నదిలో బోటింగ్

వన్నె తెచ్చేదెన్నడో?

జిల్లాను టెంపుల్ టూరిజం సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు 2024 సెప్టెంబరు నుంచి కలెక్టర్ అధ్యక్షతన పలుమార్లు పర్యాటక, పురావస్తు, దేవదాయ, అటవీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్రాజెక్టులను గుర్తించి, ప్రతిపాదనలు చేశారు. లేపాక్షిలో జటాయువు థీమ్ పార్కు, ఫుడ్ కోర్టు, స్టాల్స్, పర్యాటకులకు అదనపు గదులు, మౌలిక సదుపాయాల కల్పన, ఓపెన్ ఆడిటోరియం, మడకశిర కోటలో అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గొల్లపల్లి రిజర్వాయర్, యోగివేమన ప్రాజెక్టుల్లో బోటింగ్, తనకల్లు మండలం కోటపల్లిలో రేస్‌ట్రాక్, థీమ్ లగ్జరీ రిసార్ట్ పీపీపీ పద్ధతిలో నిర్మించాలని నిర్ణయించారు. ఇప్పటికే పుట్టపర్తి వద్ద చిత్రావతి నదిలో, బుక్కపట్నం చెరువులో ప్రైవేటు బోటింగ్ ఏర్పాటు చేయడంతో పర్యాటక శోభ తీసుకొచ్చారు. ఇంకా జిల్లాలో ఎక్కడెక్కడ బోటింగ్‌కు అవకాశం ఉందో ఆరాతీసి, ప్రతిపాదనలు రూపొందించారు. అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ ఏర్పాటుతో పెనుకొండకు దేశవిదేశీయుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో రాయల రెండో రాజధాని పెనుకొండ కొండలో పర్యాటకాభివద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని లేపాక్షి, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, అన్నమయ్య జిల్లాలోని హార్సిలీహిల్స్‌ను బెంగళూరుతో అనుసంధానిస్తూ పర్యాటక వలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.99	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	7,790	10,993
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,419	10,573
నీటి నిల్వ (టీఎంసీలు)	79.76	101.77

వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత

● వారి అనుభవం దేశానికి ఎంతో అవసరం : సీనియర్ సిటిజన్స్ దినోత్సవంలో న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లు సమాజానికి మూలాలని, ఒక దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వారి మార్గదర్శకత్వం తప్పనిసరి అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, మహిళా శిశు అభివృద్ధి శాఖ, దివ్యాంగుల , సీనియర్ సిటీజన్ల సాధికారత శాఖ, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సీనియర్ సిటిజన్ల కోసం పనిచేస్తున్న ఎన్జీఓల సంయుక్త ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి నినాదంతో 'ప్రపంచ స్థాయిలో మా హక్కులు' పేరుతో గురువారం నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో నిర్వహించిన ప్రపంచ సీనియర్ సిటీజన్స్ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో వృద్ధులపై నిర్లక్ష్యం పెరిగిపోయిందని, ఇది విచారకరమైన విషయమన్నారు. వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత అన్నారు. ఒంటరిగా ఎవ్వరినీ వదలేయరాదన్నారు. పిల్లలకు సైతం వారి వృద్ధుల పట్ల ప్రేమానురాగాలు చూపాలన్నారు. జిల్లా హామీ పథకం అమలు అథారిటీ చైర్మన్ ఈ.చిదానందప్ప మాట్లాడుతూ సీనియర్ సిటీజన్ల అనుభవం వల్లే దేశం పురోగమిస్తోందని అన్నారు. మన దేశ ప్రధానమంత్రి ,రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా సీనియర్ సిటీజన్లేనని, దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లడంలో వారి మార్గదర్శకత్వం అత్యంత ముఖ్యమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటీజన్ల ఆర్థిక సాధికారతను దృష్టిలో ఉంచుకుని 60-65 ఏళ్లపైబడిన వారికి వృద్ధాప్య పెన్షన్ ఇతర పథకాలను అమలు చేసిందని, వృద్ధులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్త్రీ శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ దేశం సుసంపన్నంగా ఉండాలంటే పిల్లలు, మహిళలు, వృద్ధుల సూచనలు తప్పనిసరి అన్నారు. నేటి తరానికి నైతిక విలువలు జీవిత మార్గదర్శకాలను పెంపొందించడం వారి బాధ్యత అన్నారు. ఈకార్యక్రమంలో శతాధిక వృద్ధులను , వివిధ రంగాల్లో సాధించిన వృద్ధులను ఘనంగా సత్కరించారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన సీనియర్ సిటీజన్లకు బహుమతులు అందాజేశారు. వివిధ రకాల పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా దివ్యాంగులు, సీనియర్ సిటీజన్స్ సాధికారత సంక్షేమ అధికారి గోవిందప్ప, మహిళా శిశు అభివృద్ధి శాఖ రిసోర్సింగ్ అధికారి సవిత, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.టీ. మల్లేశ్, సీనియర్ రచయిత్రి వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధుడిని సత్కరిస్తున్న న్యాయాధికారి రాజేశ్ హొసమనె

అప్రమత్తత తప్పనిసరి

●అధికారులు ప్రాధాన్యం గుర్తించాలి
● ప్రమాద వేళ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలి : కలెక్టర్


మాట్లాడుతున్న డీసీ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విపత్తు నిర్వహణ అథారిటీ సభ్యులుగా ఉన్న వివిధ జిల్లా స్థాయి విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఆపద సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన అధికారులతో విపత్తు నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారు లు ప్రాముఖ్యతను గుర్తించినప్పుడే వారు ఏదైనా ఊహించని విపత్తును ఎదుర్కొని, సమర్థవంతంగా పని చేయగలరన్నారు. 2025-26 వర్షాకాలంలో జిల్లాలో జరిగిన పంటనష్టం, ఆస్తి నష్టాలపై ఆయన ఆరా తీశారు. విపత్తు అనేది ప్రజా జీవితానికి ఊహించని తీవ్రమైన ముప్పు, అందువల్ల అథారిటీలో సభ్యులుగా ఉన్న వివిధ జిల్లాస్థాయి అధికారులు క్రమం తప్పకుండా మాక్ డ్రిల్ శిక్షణ పొందాలన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, వ్యవసాయ డైరెక్టర్ సోమసుందర్, అగ్నిమాపక అధికారి హనుమానగౌడ, ఉద్యానవన శాఖ, జెస్కాం , డీడీపీఐ, ప్రజాపనులు శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

సిరుగుప్ప, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏడు నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ఉచితంగా చేపడుతున్నట్లు పోస్టల్ అధికారి మంజునాథ శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వయస్సు గల పిల్లలు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. అప్‌డేట్ చేయని ఆధార్ కార్డులు పని చేయవని, తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. అప్‌డేట్ చేసే పిల్లలకు ఎలాంటి ఫీజులు తీసుకోవడం లేదని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి: బీఎన్‌హెచ్‌ఎస్



నిరసనలో బళ్లారి నాగరిక పోరాట సమితి సభ్యులు

బళ్లారి సిటీ/రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో అశాస్త్రీయ, ప్రాధాన్యం లేని పనులను త్వరగా పూర్తి చేయాలని, ప్రజలకు తగిన పౌర సౌకర్యాలను అందించాలని బళ్లారి నాగరిక పోరాట సమితి(బీఎన్‌హెచ్ ఎస్) డిమాండ్ చేసింది. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ ముందు భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈసందర్భంగా నిరసను ఉద్దేశించి బీఎన్‌హెచ్‌ఎస్ జిల్లా సమన్వయకర్త సోమశేఖర్‌గౌడ మాట్లాడుతూ నగరంలో పలు అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. రోడ్లపై గుంతలు వాహనదారులకు ఇబ్బంది పెడుతున్నాయని, వాటిని త్వరగా పూడ్చాలన్నారు. నగరంలో వాహనాల రాకపోకలను నివారించడానికి అత్యవసరంగా రింగ్ రోడ్డు నిర్మించాలని , రాత్రిపూట పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పాత బస్టాండ్ దగ్గర సర్వీస్ రోడ్డు నిర్మించాలని , వాహనాల రాకపోకలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళిక ద్వారా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నిరసనకు అధ్యక్షత వహించిన కమిటీ సభ్యురాలు నాగరత్న మాట్లాడుతూ నగరంలో గోతులు, పైపుల కోసనం తవ్విన గుంతలు ఇబ్బందిగా మారాయన్నారు. రింగ్ రోడ్డు లేకపోవడం వల్లనగరంలో 60-70టన్నుల వాహనాల కదలిక కారణంగా గని రహదారులు దెబ్బ తింటున్నాయన్నారు. తాగునీటి పైపుల్లో మురుగునీరు వస్తోందని, వర్షం వస్తే ఇళ్లలోకి నీరు చేరుతోందని, సమస్యలను పరిష్కరించక పోతే రాబోయే రోజుల్లో ఉగ్రపోరాటం చేపడుతామని హెచ్చరించారు. ఈసందర్భంగా నాగరిక పోరాట సమితి సభ్యులు శ్యామసుందర్, గురురాజ్, గోపాల్‌కృష్ణ, వీరేశ్, ఆంథోనీ సహా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపండి : ఎమ్మెల్యే

కంప్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పిల్లలను ఇళ్లకే పరిమితం కాకుండా పాఠశాల చేర్పి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. గురువారం కంప్లి తాలుకా పరిధిలోని కణివి తిమ్మలాపురం గ్రామంలో పాఠశాల ఆవరణంలో నూతన గదులకు రూ. 29 లక్షల వ్యయంతో భూమిపూజ చేపట్టారు. త్వరలోనే తిమ్మలాపురం నుండి దేవసముద్రం క్రాస్ వరకు రోడ్డు పనులకు భూమి పూజ చేపడుతామన్నారు. గ్రామం పక్కనే వుండే పెద్ద చెరువును అభివృద్ధి చేపట్టి గ్రామ ప్రజలకు రైతన్నలకు అనుగుణంగా చేపడతామని అన్నారు. తిమ్మాపురం గ్రామంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చేపట్టామన్నారు. గ్రామ ప్రజలకు రైతులకు పొలాలకు, గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా అభివృద్ధి చేపడ్తామన్నారు. కంప్లి పట్టణంలో కాయగూరలు, మార్కెట్లో రూ. ఆరు కోట్ల వ్యయంతో అభివృద్ధి చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కంప్లి నడిబొడ్డున వుండే సోమప్ప చెరువు చుట్టూ అభివృద్ధి పనులు జరిపి ప్రతినిత్యం ఉదయం సాయంత్రం వచ్చేవారికి తాగే నీరు, మరుగుదొడ్లు సేద తీర్చుకోవడానికి విశ్రాంతి గది అలాగే గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని అన్నారు. గత రెండేళ్లకు పైగా నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి గ్రామంలోను, పట్టణంలోను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిమ్మప్ప రామయ్య, పకీరప్ప, రామలింగప్ప, దేవేంద్రప్ప, రమేష్, సీఆర్ హనుమంతు, షణ్ముఖప్ప, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.


పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి

● విశ్వకర్మ నిగమ రాష్ట్ర అధ్యక్షుడు సుజ్ఞాన్‌మూర్తి ఆచారి


మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఎన్నికైన వీణకు నియామక పత్రం అందజేస్తున్న సుజ్ఞాన్‌మూర్తి

కంప్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ సమాజంలోని ప్రజలు ప్రభుత్వం ఇచ్చే సదుపాయాలను సద్వినియోగపరచుకోవాలని రాష్ట్ర విశ్వకర్మ నిగమ రాష్ట్ర అధ్యక్షుడు సుజ్ఞాన్‌మూర్తి ఆచారి తెలిపారు. గురువారం కంప్లి పట్టణంలోని విశ్వకర్మ సమాజం కాళికాదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని, ప్రతి ఇంట్లో పిల్లలకి విద్యాభ్యాసం కల్పించాలని సమాజాలతో పాటు విశ్వకర్మ సమాజం కూడా ముందుకు రావాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి సదుపాయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకుని ఆర్థికంగా మెరుగుపడాలని సూచించారు. బ్యాంకుల ద్వారా ఇచ్చే సదుపాయాన్ని మహిళలు సద్వినియోగపరచుకుని కుటుంబం ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలని మహిళలకు సూచించారు. అలాగే కుటుంబాల్లో విద్యాభ్యాసానికి దూరంగా వుండే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించి వీధి కుటుంబాల వారికి ఇల్లు వసతులు అందేలా చూస్తామన్నారు. అనంతరం విశ్వకర్మ మహిళా మోర్చ అధ్యక్షురాలిగా వీణ, మౌనేష్, ఎంపిక చేసి వారికి అర్హత పత్రం అందించారు. ఇకపై మహిళల్లో కూడా సమాజం అభివృద్ధికి కృషి చేపట్టాలి. ఉత్తేజాన్ని తీసుకురావాలని తెలిపారు. తమపై నమ్మకం వుంచి వారికి తాము అభివృద్ధి పనులు జరిపి నమ్మకాన్ని నిలబెట్టు కుంటామని నూతన అధ్యక్షురాలు వీణ తెలిపారు. అనంతరం నిగమ అధ్యక్షులకు కంప్లి విశ్వకర్మ సమాజం నుండి అభినందించి సన్మానించారు. ఈకార్యక్రమంలో విశ్వకర్మ నిగమ సభ్యులు డి మౌనేష్ ఆచారి సంఘం అధ్యక్షులు రుద్రపాచారి చంద్రశేఖర్ కళాచారి, గురుమూర్తి, రాఘవేంద్ర, నారాయణ, రఘు, గణేష్, జయలక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరిగినా..కనికరించరు..!

● కాంట్రాక్ట్ ఉద్యోగి మరణించి రెండేళ్లు ● పీఎఫ్, ఈఎస్ఐ అందలేదని విమ్స్ ముందు తల్లి ఆందోళన

బళ్లారిరూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసిన తన కుమారుడు చనిపోయి రెండేళ్లయిందని, అయినా ప్రభుత్వం పీఎఫ్, ఈఎస్ఐ ఇవ్వకుండా వేధిస్తోందని తల్లి గురువారం నిరసనకు దిగింది. విమ్స్ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి ప్రకాశ్ అనారోగ్యంతో మృతి చెందారు. అయితే అతనికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ తదితర నిధుల విడుదలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రం అందజేసినా స్పందించలేదని, తమ కుటుంబం కష్టాల్లో ఉన్నా కరుణించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. విమ్స్ ఆస్పత్రి కార్యాలయం ముందు కుటుంబ సభ్యులు ప్రకాశ్ ఫొటోతో ధర్నా నిర్వహించారు. ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్న తమను పట్టించుకునే నాథుడే లేదని వాపోయారు. దినిపై స్పందించిన డైరెక్టర్ గంగాధర గౌడ్ ఒక నెల గడువు ఇవ్వాలని, మొత్తం డబ్బు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ కుటుంబ సభ్యులు రాము, జగన్, మంజు పల్లవి, వెంకటేష్, అరుణ, లలిత, చంద్రకళ, రేణుకమ్మ, హనుమక్క, షేక్షావలీ, యశ్వంత్, పరశురాం పాల్గొన్నారు.


ఆస్పత్రి ముందు నిరసనలో ప్రకాశ్ తల్లి, కుటుంబ సభ్యులు


క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న టీబీ బోర్డు అధికారులు

ఎల్లెల్సీ క్వార్టర్స్ ప్రారంభం

బళ్లారి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) కార్యాలయ ఆవరణలో సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్స్‌ను ప్రారంభించారు. ఇంజనీర్లు, సిబ్బంది కోసం నూతనంగా నిర్మించిన భవనాలను టీబీ బోర్డు చైర్మన్ ఎస్‌కే పాండే, ఎస్ఈ నారాయణ నాయక్, సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది కోసం సుమారు 6 క్వాటర్స్‌ను నూతనంగా నిర్మించామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో పాటు కాంట్రాక్టర్ రాజేంద్ర, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులపై అవగాహన కల్పించాలి

● వాణిజ్య మండలి జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి

బళ్లారి సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపులపై వ్యాపారులతో పాటు, ప్రజలకు సైతం అవగాహన తప్పనిసరి అని జిల్లా వాణిజ్య మండలి అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి సూచించారు. గురువారం నగరంలోని వాణిజ్య మండలి భవనంలో బళ్లారి పన్ను ప్రాక్టీషనర్స్ అసోసియేషన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ ఇండియా, కర్ణాటక సివిల్ ఇంజనీర్స్ నిర్వహించిన టాక్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి ప్రజలు, వ్యాపారులకు పన్నులపై అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈశిబిరంలో స్పాంజ్ ఐరన్, మెడికల్ , కిరాణా , కోల్డ్ స్టోరేజ్, కాటన్ మిల్లు, వివిధ రంగాల్లో పన్నుల చెల్లింపు పై అవగాహన కల్పిస్తున్నావన్నారు. అధికారి శ్రీధర పార్థసారధి పన్నుల చెల్లింపులు గురించి వివరించారు. పన్నులు కమిటీ చైర్మన్ రాజశేఖర్ రికార్డులు నమోదు,పన్నుల చెల్లింపు పద్ధతుల గురించి తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన కార్యదర్శి సురేశ్ బాబు, సహాయ కార్యదర్శులు మర్చేడ్ మల్లికార్జునగౌడ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యోత్సవం


కళాకారులను సత్కరిస్తున్న రంగభూమి ట్రస్టు సభ్యులు

బళ్లారి సిటీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నృత్య కళను కాపాడి పెంచే పని మనందరి హక్కుఅని రంగభూమి కళాకారుడు నాగభూషణ్ అన్నారు. సూర్యకళాట్రస్టు ,కన్నడ సాంస్కృతిక శాఖతో కలిసి రంగమందిరంలో బుధవారం నిర్వహించిన గెజ్జెపూజ నృత్యోత్సవ కార్యక్రమంలో నృత్య ప్రదర్శన, కళాకారులకు అవార్డు పత్రాన్ని అందించారు. ఈసందర్భంగానాట్య గురు సుంకన్న, రూప, సుధాకర్, కార్తీక్, విండ్యేశ్వరీ, లక్ష్మీనారాయణ, భవ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన


డీటీ సిద్దార్థకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు

సిరుగుప్ప, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : న్యాయమూర్తి జస్టిస్ డీఆర్ గవాయిని అవమానించడం సరైంది కాదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొడ్లి మల్లికార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సిరుగుప్ప పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంఘం, దళిత సంఘం ఆధ్వర్యంలో సుప్రీం కోర్టులో జరిగిన సంఘటనను నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రాకేష్ కిషోర్ అనే న్యాయవాది సాటి న్యాయవాది గవాయిపై షూ చూపించడం సరైంది కాదని విమర్శించారు. తక్షణమే ఆయనను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అనుసరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు ఎస్పీ గంగప్ప, చలవాది మహాసభ గౌరవాధ్యక్షులు సన్న రామయ్య, మారేష, దళిత నాయకులు కొడ్లి ధర్మరాజు, వీరేష, తదితరులు పాల్గొన్నారు.

అధికారిని సస్పెండ్ చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సమాజ సంఘం నాయకులు

బళ్లారి రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్ నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన అధికారిని సస్పెండ్ చేయాలని సమాజసంఘం నాయకులు కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడుతూ నగరంలో గత నెల 29వ తేదీ జిల్లా పంచాయతీ హాల్లో జరిగిన ప్రగతి సమీక్ష సమావేశంలో రవాణా శాఖ పట్ల పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కేఎస్‌ఆర్టీసీ డివిజన్ కంట్రోలర్ డీసీ విభాగానికి వినయ్ భగవాన్ గైర్హాజరయ్యారని, దీనిపై ఆగ్రహించిన కలెక్టర్ ఆయన్ని సస్పెండ్ చేయాలని అప్పటికే ఆదేశించా రన్నారు. సంఘం నాయకులు ఉక్లూరు సిద్దేశ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

హోసూరు జోన్

నేడు హోసూరుకు సీఎం రాక

హోసూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం హోసూరుకు చేరుకుంటారు. ఉదయం 8 గంటలకు చెన్నైలో బయల్దేరే ముఖ్యమంత్రి స్థానిక పెలకొండపల్లిలోని ప్రైవేట్ విమానాశ్రయంలో 9 గంటలకు చేరుకుంటారు. అక్కడనుంచి పొరుగున కర్ణాటక రాష్ట్రం రామనగరలో జరిగే మురసోలి సెల్వం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. భోజనానంతరం 2 గంటలకు రామనగర నుంచి కారులో హోసూరు విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడనుంచి చెన్నైకు బయల్దేరుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో విమానాశ్రయం నుంచి సరిహద్దులోని జూజువాడి చెక్‌పోస్టు వరకు, తళి రోడ్డు వరకు బందోబస్తు చర్యలు చేపట్టారు.

అన్నాడీఎంకేలోకి పలువురి చేరిక


పార్టీలోకి మహిళలను ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణా రెడ్డి

హోసూరు (కృష్ణగిరి), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమ జిల్లా అన్నాడీఎంకే కార్యాలయంలో గురువారం పెద్దసంఖ్యలో మహిళలు పార్టీలోకి చేరారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి సమక్షంలో వారిని సాదరంగా స్వాగతించారు. ఏరియా కార్యదర్శి రాజు నాయకత్వంలో అన్నాడీఎంకేలోకి చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళల సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం కోసం అన్నాడీఎంకే ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. పార్టీ విధానాలకు ఆకర్షితులైనవారు చేరుతున్నారన్నారు. మహిళలు పార్టీలో చేరుతుండడంతో కొత్తబలం వచ్చినట్టు అవుతోందన్నారు.

ప్రశ్నార్థకంగా వలస కూలీ పిల్లల జీవితాలు

హోసూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో చిన్నపెద్ద 3వేలకుపైగా ఫ్యాక్టరీలు ఉండడంతో జీవనోపాధి కోసం తమిళనాడు నుంచే కాకుండా ప్రత్యేకించి ఉత్తరాది రాష్ట్రాలనుంచి కూడా ఉపాధి కోసం వస్తుంటారు. కూలీ పనులు జీవనం సాగించేవారు అత్యధికంగా ఉన్నారు. వారంతా రైల్వేస్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలలో గుడిసెలలో ఉంటున్నారు. పేదరికం కారణంగా 5-10ఏళ్ల వయస్సు పిల్లలు పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితిలో ఉన్నారు. కొంతమంది భిక్షాటన చేస్తుండగా మరికొందరు ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నారు. వలస కూలీల పిల్లల పరిస్థితి దుర్భరంగా ఉంటోంది. ఇటువంటి వారికి కనీసవిద్య కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు కోరుతున్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాల మూటలతో పిల్లలు